క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన

- నేత్ర వైద్యశిబిరంలో 120 మందికి తనిఖీలు
- శస్త్రచికిత్సకు 30 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు 130 మంది రోగులను పరీక్షించి, 30 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. 20 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, మిగిలిన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సముద్రపు రామారావు, ఎంఎం నాయుడు, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీను, తుమ్ము నారాయణ మూర్తి, అవనాపు మురళీకృష్ణ, పోలుబోతు గణేష్, ఉపాధ్యాయులు కడలి గణేష్, తలాడ మహేష్, సముద్రపు శ్రీనివాసరావు, సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, తుమ్ము అశోక్, అవనాపు అప్పలరాజు, డి.పూర్ణ, శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఎస్.అలేఖ్య ,క్యాంప్ ఇన్‌చార్జ్ సీహెచ్ వెంకటరమణ, వై. పైడిరాజు పాల్గొన్నారు.

24న విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చాకివలస, అమటాం, రావివలస, సన్‌రే విలేజ్, ఎయిర్‌పోర్టు పరిధిలో ఈనెల 24న విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఆ రోజు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రవేశ పరీక్షకు స్పందన

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు విశేష స్పందన వచ్చింది. మొత్తం 100 సీట్లకు గాను 305 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు.

528 మంది హాజరు..

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్‌లోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన పరీక్షకు 528 మంది హాజరయ్యారని స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా ఫర్వీన్ తెలిపారు. మొత్తం 643 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 115 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

'సిద్ధం' సభకు సిద్ధం కండి

- 23న చెల్లూరు జంక్షన్‌లో బహిరంగ సభ
- పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలి : కోలగట్ల



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: చెల్లూరు కూడలి వద్ద ఈ నెల 23న నిర్వహించనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సిద్ధం బస్సుయాత్ర ఈ నెల 23న చెల్లూరు కూడలి వద్దకు చేరుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సిద్ధం సభలకు ప్రజలు పోటెత్తారన్నారు. అదేరీతిలో చెల్లూరు సభకు కూడా అధిక సంఖ్యలో ప్రజలు వస్తారని ఆశాభావం వక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చడంతో రానున్న ఎన్నికల్లో ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 22 గ్రామాలు, 50 డివిజన్లలో బహిరంగ సభలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలకు ఓట్లు అడుగుతామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా సహాయ, సహకారాలు అందించిందో వివరిస్తున్నట్లు తెలిపారు. గత పాలకుల హయాంలో మంచినీటికి మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ప్రస్తుతం తాము చేపట్టిన ప్రణాళికబద్ధమైన విధానాలతో మహిళలకు నీటి సమస్య తీరిందన్నారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికి అధినేత జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర విజయవంతంగా సాగుతోందని చెప్పారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, శెట్టి వీర వెంకట రాజేశ్వరరావు, నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కంటుభుక్త తవిటిరాజు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా...



పూసపాటిరేగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ప్రతి ఒక్కరికీ జగనన్న విద్యాకానుక కిట్లు
- తల్లిదండ్రులపై పడని ఆర్థిక భారం
- వైఎస్సార్‌సీపీ వచ్చాక బాగుపడిన ప్రభుత్వ బడులు
- ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్న తల్లిదండ్రులు

పూసపాటిరేగ: విద్యార్థి ఉజ్వల భవితకు చదువు ముఖ్యం.. చదువుపై విద్యార్థులకు ఆసక్తి పెరగాలంటే మౌలిక సదుపాయాలు కల్పించాలి.. సరిగ్గా ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నడుంబిగించారు. కోట్లాది రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అదనపు భవనాలు నిర్మించారు. అలాగే కార్పొరేట్ స్థాయి విద్య అందించేక్రమంలో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తూ, అభినందనలు అందుకుంటున్నారు. గతంలో పాఠశాలలు ప్రారంభమైన ఆరేడు నెలల వరకు పుస్తకాలు, యూనిఫారాలు అందేవి కావు. కాని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యాకానుక కిట్లలో భాగంగా పుస్తకాలు, బూట్లు, షూస్, టై, బెల్ట్, డిక్షనరీ, తదితర వస్తువులు అందిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలంలో 7,440 మంది విద్యార్థులు.. భోగాపురంలో 5,611 మంది.. డెంకాడలో 4,128 మంది.. నెల్లిమర్లలో 8,420 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందాయి. నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 25,599 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. తల్లిదండ్రులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకపోవడంతో తమ పిల్లలను సంతోషంగా పాఠశాలలకు పంపిస్తున్నారు. అలాగే విద్యార్థులను ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తోందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



యూనిఫారంతో విద్యార్థులు

ఉపయోగపడ్డాయి..



జగనన్న విద్యాకానుక కిట్లు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రభుత్వమే మా అవసరాలను గుర్తించి పుస్తకాలు, యూనిఫాం, షూ మంజూరు చేయడం ఆనందంగా ఉంది. ప్రత్యేక తరగతుల వల్ల పరీక్షలలో మంచి మార్కులు సాధిస్తున్నాం. విద్యాకానుక కిట్లు మంజూరు చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. – కెల్ల కావ్యశ్రీ, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, పూసపాటిరేగ

విద్యార్థులకు వరం..



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన విద్యార్థులకు వరంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా యూనిఫాం, షూ, పాఠ్యపుస్తకాలు అందజేయడంతో చదువుపై మరింత ఆసక్తి పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులందరూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– చుక్కా గుణవేణి, విద్యార్థిని తల్లి, పూసపాటిరేగ

సీఎం జగన్‌తోనే ఇంటింటికీ సంక్షేమం..




రాజాపులోవలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు

- ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు
- రాజాపులోవలో ఎన్నికల ప్రచారం

భోగాపురం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని రాజాపులోవలో వైఎస్సార్‌సీపీ మండల స్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అందించిన పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జనసేన నాయకురాలు లోకం నాగమాధవి ఎన్నికలప్పుడు ప్రజల వద్దకు వస్తుంటారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాత్రం ఐదేళ్లూ ప్రజల మధ్యనే ఉంటూ అండగా నిలిచారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి వెంకటరమణ, పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, వాసుపల్లి రేయ్యుడు, పూడిక సూకరాజు, రిక్కా అప్పలనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగురోడ్డు టౌన్ సెంటర్ లేఅవుట్‌లో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడకు చెందిన డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ ఆదివారం చేసిన రామాయణ అనుగ్రహ భాషణం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రామాయణంలోని పలు అంశాలను వివరిస్తున్న డాక్టర్ అద్దంకి శ్రీనివాస్

జగనన్న హయాంలోనే గ్రామాల అభివృద్ధి



పారసాంలో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండకు స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- గ్రామాల్లో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



కోరాడపేటలో చిన్నారిని ఎత్తుకున్న బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని తంగుడుబిల్లి, దన్నానపేట, ఏటీ అగ్రహారం, రామతీర్థం, పారసాం, చిన బూరాడపేట, పెద బూరాడపేట గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెత్తందారుల వైపు చంద్రబాబు ఉంటే, బడుగు బలహీన వర్గాల వైపు సీఎం జగనన్న ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ప్రతిపక్ష అభ్యర్థి ఇచ్చే బకెట్లకు, డబ్బుకు ఆశ పడి ఓట్లు వేస్తే తినే తిండిని కాళ్లతో తన్నుకున్నట్లు అవుతుందన్నారు. ఇంటింటా సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో కూడా రెండూ ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఓటమి భయంతో మూడు పార్టీలు ఏకమై జగనన్నతో యుద్ధానికి వస్తున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం రామతీర్థం, బూరాడపేట గ్రామాల్లో పలు టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమళ్లు వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్‌లు గేదెల రామచిరంజీవి, పిన్నింటి చిన అప్పలనాయుడు, కంచరాపు సూర్యకళ, ముక్కువ తవుడమ్మ, బెల్లాన అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యులు తర్లాడ జయమ్మ, సంగంరెడ్డి జగన్నాథం, నాయకులు దంతులూరి గిరిబాబు, కోట్ల పైడినాయుడు, బెల్లాన రామారావు, ముక్కువ రమణ, వెంకటరమణ, మహంతి రామారావు, తర్లాడ దుర్గారావు, కంచరాపు రాము, అంబళ్ల కిరణ్, మత్స శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీని కట్టబెట్టాలి..

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి



దుప్పాడ ఎన్నికల ప్రచార ర్యాలీలో డిప్యూటీ మేయర్ శ్రావణి, దుప్పాడ గ్రామ మహిళలు

విజయనగరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, బెల్లాన చంద్రశేఖర్‌లకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి కోరారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని దుప్పాడలో ఆమె పర్యటించారు. స్థానిక మహిళలు మంగళ హారతులతో శ్రావణికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల 10 నెలల కాలంలో సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పాలన సాగించారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి ఏడాదిలోనే గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజల గడప వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య పథకాలు విద్యార్థులకు వరంగా మారాయని చెప్పారు. నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చడమే కాకుండా ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమం, జగనన్న విద్యాకానుక, బైజూస్ ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద వంటి కార్యక్రమాలతో పాఠశాల విద్యావ్యవస్థకు కొత్త రూపు తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోని ప్రజలకు 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండేలా వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. జగనన్న సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో వారానికోసారి నిపుణులైన వైద్యులతో గ్రామాల్లోనే వైద్య సేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకంతో ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ, శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. మహిళలకు ఆర్థికభరోసా కలిగించడానికి వైఎస్సార్ చేయూత పథకం, పావలా వడ్డీ, రుణమాఫీ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. రైతుల సంక్షేమానికి గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందిస్తున్నారన్నారు. ప్రతి ఏటా రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 13,500లు అందించిన ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపారు. గూడులేని పేదలకు లక్షల విలువ చేసే ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కెల్ల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుమజ్జి రాములప్పుడు, బద్రి బుజ్జి, చందక పరుశురామ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవాలయానికి ఏసీ బహూకరణ

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి రూ. 34 వేల విలువైన ఏసీని దాతలు బహూకరించారు. పట్టణానికి చెందిన మిరియాల జయబాబు, చిన కనకరత్నం కుమారుడు, కోడలు క్రాంతికుమార్, ప్రణాళిని ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద్), వైస్‌చైర్మన్ సూరు కుమార్‌లకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ జి.శ్రీనివాస్, సూరు కామేష్, కింతలి శ్రీను, కండ్యాన వసంత్, ఎస్‌వీజీ శ్రీను, కింతలి మధు, సుంకరి శ్రీహరి పాల్గొన్నారు.



ఏసీ అందజేస్తున్న దాతలు

రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు



జేఎన్‌టీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్‌లను రూపొందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- లెండీ, జేఎన్‌టీయూ కళాశాలలను పరిశీలించిన కలెక్టర్

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం ఉదయం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, డెంకాడ మండలంలోని లెండీ ఇంజినీరింగ్ కళాశాలలను ఆమె సందర్శించారు. వాహనాల పార్కింగ్ కోసం పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగురూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లుపై సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాలు, జేఎన్‌టీయూజీవీలో బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిసెప్షన్ సెంటర్ సిబ్బందితో పాటు, పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటర్లు తగినంత విశాలంగా, పూర్తి లైటింగ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంలను తీసుకురావడానికి, స్ట్రాంగురూములోకి తరలించడానికి, అవసరమైన పత్రాలను నింపేందుకు, అందజేసేందుకు వీలుగా కౌంటర్లు ఉండాలన్నారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా రెండు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో స్పెషల్ కౌంటర్లు, ఆర్ఓ టేబుల్, హెల్ప్ డెస్క్, స్క్రూటినీ, మైక్రో అబ్జర్వర్స్ కోసం కూడా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. మంచిగా భోజన సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గరనుంచి, తమకు కేటాయించబడ్డ కౌంటర్లకు సులువుగా చేరుకొనేవిధంగా, గుర్తించే విధంగా నేమ్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని ప్రతీచోటా కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలని, పనులు వెంటనే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆయా కేంద్రాల నోడల్ అధికారులైన మెప్మా పీడీ ఎం.సుధాకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డిప్యుటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఎస్ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డీఎం మీనా కుమారి, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటెయ్యండి..



కొండకరకాంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేఅభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. మండలంలోని కొండకరకాం, ద్వారపూడి, గుంకలాం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచార కార్యక్రమం సందర్భంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఐదేళ్లల్లో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి ఇబ్బందులు తొలగించామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు ఏర్పాటు చేసి ప్రజలకు 546కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు నిర్మించి రైతు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు అలాగే వైఎస్సార్ ఆరోగ్య క్లినిక్‌లు (వెల్‌నెస్ కేంద్రాలు) ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాజకీయాలకు అతీతంగా, లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. నాడు ప్రజల కష్టాలను తీర్చలేని చంద్రబాబు.. ఈరోజు జగన్ చేస్తున్న సంక్షేమ పాలన చూసి ఓర్వలేకపోతున్నాడని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వచ్చే అరువు నేతలను పక్కనబెట్టి ప్రజలకు ఎల్లప్పుడూ ఉండే నాయకులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, సర్పంచ్ కిలారి రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు బి.ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.